క్లుప్తంగా

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు గడువు 31

తగరపువలస: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్‌నకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కేంద్ర సలహా మండలి సభ్యుడు సరగడ సంజీవరెడ్డి శుక్రవారం కోరారు. అభ్యర్థుల వయసు 21 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలని.. ఇంటర్, ఐటీఐ, డిప్లమా, లేదా డిగ్రీ విద్యార్హత గలవారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాది పాటు శిక్షణతో పాటు నెలకు రూ.5వేలు స్టైపెండ్ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం ఎంపిక చేసిన 500 సంస్థలలో చేరే ముందు రూ.6వేలు గ్రాంట్ ఇస్తారని తెలియజేశారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌కు 'దివీస్' వితరణ



టి.నగరపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌కు దివీస్ అందించిన ఫర్నిచర్

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం టి.నగరపాలెం పంచాయతీలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌కు శుక్రవారం రూ.95వేల విలువైన ఫర్నిచర్ అందించింది. వీటిలో ఔషధాలు భద్రపరిచే బీరువాలు, పేషెంట్ల కోసం ఐరన్ సేఫ్ బెడ్‌లు, కూర్చునేందుకు కుర్చీలు, సేఫ్టీ గ్రిల్స్ ఉన్నాయి. సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి అభ్యర్థన మేరకు వీటిని అందించినట్టు దివీస్ సీఎస్‌ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. పేషెంట్లకు మేలైన సేవలు అందించడానికి ఈ ఫర్నిచర్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వి.స్వాతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి శశికళ, దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది

మధురవాడ: వ్యాధులు రాకుండా చూసుకోవాలంటే, వాటిపై అవగాహన పెంచుకోవడం అవసరమని టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం అన్నారు. మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్లయ్యపాలెం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు టీబీ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మం మాట్లాడుతూ టీబీ వచ్చిన వారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారని, మందులు ఉచితంగా అందిస్తారని చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కఫంతో పాటు రక్తం పడడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ఇషాక్, అనూష, ఉపాధ్యాయులు ఎర్నినాయుడు, కె.వెంకటరావు, ఆశ, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా



చిట్టివలస జెడ్పీహైస్కూల్ ముందు రహదారిలో వృథాగా పోతున్న నీరు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు కొండపేట మార్గంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ముందు పైపులైన్ లీకేజీ కారణంగా శుక్రవారం తాగునీరు వృథాగా పోయింది. ఈ కారణంగా చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం వరకు రహదారి చెరువులా మారిపోయింది. ఈ పైపులైన్ మరమ్మతులు చేయడానికి సిబ్బంది ఉపక్రమించారు. గతంలోనూ ఇదే చోట పలుమార్లు పైపులైన్ నుంచి నీరు వృథాగా పోయింది. దీంతో నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే వందలాది మంది విద్యార్థులు, దివీస్ ఉద్యోగులతో పాటు గుడివాడకు చెందిన స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పైపులైన్‌కు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని కొండపేట వాసులు కోరుతున్నారు. ఈ పైప్‌లైన్ కారణంగా అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్డును కూడా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కళ తప్పిన కల్యాణ మండపం


- కనీస మరమ్మతులు లేక శిథిల స్థితికి..
- లక్షల ఆదాయం కోల్పోతున్న జీవీఎంసీ
- పట్టించుకోని అధికారులు



శిథిలమైన ప్రధాన పిల్లర్



కనీస వసతులు లేని ద్రోణంరాజు కల్యాణ మండపం



కూలడానికి సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంక్

మధురవాడ: చంద్రంపాలెం కృష్ణానగర్‌లోని ద్రోణంరాజు కల్యాణ మండపంలో కనీస సదుపాయాలు లేక మూలకు చేరింది. జీవీఎంసీ జోన్ 5, 7 వార్డుల్లో ప్రజల సౌకర్యార్థం మధురవాడకి మధ్యలో హైవేకు అత్యంత సమీపంలో 2008లో అప్పటి రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ నిధులతో సుమారు అర ఎకరం విశాల స్థలంలో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించారు. అప్పట్లో ప్రభుత్వ కల్యాణ మండపం అంటే ఇదే అన్నట్టు ఉండేది. దీనిని బుక్ చేసుకోవడానికి అంతా చాలా ఆసక్తి చూపేవారు. తర్వాత జీవీఎంసీ ఆదాయార్జనే తప్ప వసతుల కల్పన, నిర్వహణ వంటివి పట్టించుకోకపోవడంతో రూపం కోల్పోయింది.

ప్రధాన సమస్యలు ఇవీ ..

- ఇక్కడి ఓవర్‌హెడ్ ట్యాంక్ మూలకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. వైరింగ్ సక్రమంగా లేదు.
- మరుగుదొడ్లు వాడడానికి అనువుగా లేవు సరికదా చుట్టూ తుప్పలు పేరుకున్నాయి.
- వధూవరుల కోసం ఏర్పాటు చేసిన గదులు తప్ప మిగిలినవాటికి తలుపులు కూడా సక్రమంగా లేవు.
- వైరింగ్, ఫ్యూజ్ కటౌట్‌లు, స్విచ్ బోర్డులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక ఫ్యాన్లు, లైట్ల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది అన్నట్లుగా ఉంది పరిస్థితి.
- కనీస మరమ్మతులకు కూడా నోచుకోపోవడంతో పైకప్పు, సీలింగ్ దారుణంగా తయారయ్యాయి. సిమెంట్ పెచ్చులు, సీలింగ్ అట్టలు జారిపడుతున్నాయి.
- ఇక్కడే జీవీఎంసీ క్లాప్ వాహనాలు పార్క్ చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పైగా ఇవి కల్యాణమండపం వాతావరణాన్ని దెబ్బతీస్తున్నాయి.
- కల్యాణమండపం పరిసరాల్లో తుప్పలు, చెట్లు పెరిగి బూత్ బంగ్లాను తలపిస్తోంది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా క్లాప్ వాహనాల పార్కింగ్ ప్రదేశంగా, డంపింగ్ యార్డుగా మారిపోయింది.

జీవీఎంసీ ఆదాయానికీ గండి

కల్యాణ మండపంలో కనీస సదుపాయాలు లేకపోవడం, అద్దె భారీగా ఉండడంతో ఎవరూ ఫంక్షన్లు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో 2011-12 ఆర్థిక సంవత్సరం వరకు కనీసం ఏడాదికి రూ. 8లక్షల చొప్పున ప్రైవేటు వ్యక్తులు చెల్లించి పాడుకునేవారు. 2012 నుంచి జీవీఎంసీ ఆక్షన్‌లో ఎవరూ పాడుకోవడం లేదు.



కల్యాణ మండపంలో పార్క్ చేసిన చెత్త తరలించే క్లాప్ వాహనాలు

ఇతర కల్యాణ మండపాలదీ ఇదే పరిస్థితి

ఇక ఆర్‌జీకే, వాంబే కాలనీల్లో కల్యాణ మండపాలది కూడా ఇదే పరిస్థితి. అధికారులు చిన్నపాటి మరమ్మతులు చేస్తే ఏడాది ఈ మూడింటికి కనీసం రూ.24లక్షలు ఆదాయం జీవీఎంసీకి సమకూరుతుంది. రెండేళ్ల ఆదాయం ఖర్చు చేస్తే ఇవి ఎంతో ఉపయుక్తంగా మారుతాయని స్థానికులు అంటున్నారు. ఉన్నత స్థాయి అధికారులైనా స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆనవాళ్లే లేకుండా పోయింది



జీవీఎంసీ 5,6,7 వార్డుల్లోని ప్రాంతాల ప్రజలకు ద్రోణంరాజు కల్యాణమండపం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. నిత్యం శుభ కార్యాలతో కళకళలాడేది. అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో కల్యాణమండపం ఆనవాళ్లే లేకుండా ఉంది.

– పోతిన పైడిరాజు, చంద్రంపాలెం

ఫంక్షన్ హాళ్లకు భారీగా ఖర్చు



జీవీఎంసీ కల్యాణ మండపాలు అందుబాటులో లేక ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో కార్యక్రమాలు చేయాల్సి వస్తోంది. స్తోమత లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో అద్దె ఎక్కువే అయినా, వాటినే ఆశ్రయించాల్సి వస్తోంది. జీవీఎంసీ అధికారులు స్పందించి మరమ్మతులు చేస్తే మాలాంటి వారికి ఎంతో ఉపయోగం.

– దుక్క వరం, మధురవాడ

పరిశీలించి చర్యలు చేపడతాం

ద్రోణంరాజు కల్యాణమండపాన్ని పరిశీలించి చర్యలు చేపడతాం. మా పరిధిలో ఉన్న అవసరమైన చర్యలు చేపడతాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– కె.కనకమహాలక్ష్మి, జోనల్ కమిషనర్

దబ్బందలో సెల్‌టవర్ పనులు ప్రారంభం

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బందలో శుక్రవారం బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్ నిర్మాణ అనంతర పనులు ప్రారంభం అయ్యాయి. కొంతకాలంగా ఈ గ్రామ ప్రజలకు పూర్తి స్థాయిలో సెల్‌ఫోన్ సేవలు అందుబాటులో లేవు. ఈ కారణంగా ఇక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై మాజీ ఎంపీపీ డోల దేవుడు ఇటీవల పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి సెల్‌టవర్ నిర్మాణ అనంతర పనులు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీటీసీ సభ్యుడు డోల ఆనంద్ తదితరులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సెల్‌టవర్లు నిర్మించారని, తదనంతర పనులు ఎట్టకేలకు ప్రారంభించడంతో సెల్‌ఫోన్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని అన్నారు.

ఉపాధి హామీ నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలకు డిమాండ్

తగరపువలస: ఆనందపురం మండలం కొంత్యాం పంచాయతీలో ఉపాధి హామీ నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు. బినామీ పేర్లతో మస్తర్లు వేసి వారి పేరున బ్యాంకు ఖాతాలకు మళ్లించిన నగదు వివరాలపై నిగ్గు తేల్చాలన్నారు. పంచాయతీలో 18 ఏళ్లకు పైగా ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్టు ఆరోపిస్తున్నారు. ప్రతిచోటా ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ జరుగుతున్నా, తమ పంచాయతీలో అడ్డుకున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయంపై కేసు నమోదైంది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. మధురవాడ స్వతంత్ర నగర్ సచివాలయ పరిధిలో కొంతమంది గంజాయి విక్రయిస్తున్నట్టు శుక్రవారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ భాస్కరరావు సిబ్బందితో దాడిచేసి గంజాయి విక్రయిస్తున్న అదే ప్రాంతానికి చెందిన కరకాని గణేష్, తొంపల సాయికుమార్, బావన రామదాసు, నిడదలోవు రాములను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ధ్యానంతో ప్రశాంత జీవనం



ధ్యానం చేస్తున్న ఔత్సాహికులు

భీమునిపట్నం: భీమిలి జగన్నాథ స్వామి ఆలయం వద్దనున్న ఇంద్రద్యుమ్న మందిరంలో మూడు రోజుల ధ్యానోత్సవ శిక్షణ శుక్రవారం సాయంత్రం ప్రారంభమైంది. విశాఖకు చెందిన హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. నిర్వాహకులు గుర్ల సురేష్, ఎం.వాసుదేరావు మాట్లాడుతూ మన జీవన విధానం ఇప్పుడు ఎంతో యాంత్రికంగా మారిపోయిందని.. ఎన్నో సమస్యలు, ఆందోళనల మధ్య జీవిస్తున్నామని అన్నారు. దీంతో మానసికంగా, శారీరకంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని, వాటి నుంచి బయట పడడానికి ధ్యానం ఒక్కటే సరైన మార్గ మని అన్నారు. ధ్యానం ఎలా చేయాలి, దానివల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియపరచాలని తమ సంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఔత్సాహికులు, స్థానికులు పాల్గొన్నారు.

నిత్య విద్యార్థుల్లా ఉండాలి

పాత్ర ఇండియా బీపీవో సర్వీసెస్ ఎండీ లక్ష్మి ముక్కవిల్లి



ముఖ్యఅతిథి లక్ష్మిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

మధురవాడ: నేర్చుకోవడం అనేది కాలేజీ అయిపోయిన వెంటనే వదిలేయకూడదని, అందరూ నిత్య విద్యార్థుల్లా ఉండాలని పాత్ర ఇండియా బీపీవో సర్వీసెస్ ఎండీ లక్ష్మి ముక్కవిల్లి సూచించారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియాలో చాటింగ్ మాత్రమే కాక, జ్ఞాన సముపార్జనకు అనేక అవకాశాలున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీ ద్వారం మ్యూజిక్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ ద్వారం వెంకట కృష్ణగణేష్ త్యాగరాజ్, గాయత్రి వైస్ ప్రెసిడెంట్ డి.దక్షిణామూర్తి, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. గాయత్రి గవర్నింగ్ బాడీ సభ్యుడు డాక్టర్. పి.రాజగణపతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోస్వామి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు



డిపోలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్ఎం అప్పలనాయుడు

దాబాగార్డెన్స్/మధురవాడ: శ్రీరామ నవమి పురస్కరించుకొని విశాఖపట్నం నుంచి భద్రాచలంకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు విశాఖపట్నం ద్వారకా బస్‌స్టేషన్ నుంచి వయా రాజమండ్రి మీదుగా భద్రాచలంకు ఏప్రిల్ 5 ఉదయం 6 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయల్దేరతాయని చెప్పారు. ప్రయాణికులు, భక్తులు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు.

మధురవాడ డిపో తనిఖీ : మధురవాడ డిపోను ఆర్ఎం శుక్రవారం తనిఖీ చేశారు. డిపోలో బస్సులు పెరుగుతున్న దృష్ట్యా సిబ్బంది మరింత చురుగ్గా పని చేయాలని, ప్రయాణికుల సౌకర్యార్థం సర్వీస్ చేయాలని సూచించారు. ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ముందుగా ఆన్‌లైన్లో రిజర్వేషన్ చేసుకుని వెళ్లాలని, అందుకు సిబ్బంది సహకారం ముఖ్యమన్నారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలానికి నడిపే ప్రత్యేక సర్వీసుల కోసం ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9552300009 నంబరులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ రాజేశ్వరి, ట్రాఫిక్ ఇంజినీర్ దుర్యోధన, రాజు సిబ్బంది పాల్గొన్నారు.

కాజ్‌వే శిథిలం



గోతులు పడి ఇలా..



శిథిలమైన కాజ్‌వే

పద్మనాభం: పాండ్రంగి సమీపాన గోస్తని నదిపై కాజ్‌వే శిథిలమైంది. దీంతో దీనిపై రాకపోకలు సాగించడానికి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కాజ్‌వే పెద్ద పెద్ద పెచ్చులూడి గోతులు పడింది. దీంతో రాత్రి వేళల్లో మార్గం కనిపించక పాదచారులు పెచ్చులను తన్నుకుని పడిపోతున్నారు. ఈ కాజ్‌వే మీదుగా పద్మనాభం మండల పాండ్రంగి, అనంతవరం, పెంట, పి.కొవ్వాడ, కొత్త కొవ్వాడ, ఆనందపురం మండలం బోని గ్రామాలకు చెందిన ప్రయాణికులు, ప్రజలు తగరపువలస, భీమునిపట్నం వెళ్తుంటారు. ద్విచక్ర వాహనానాలు ఆటోలు తిరుగుతుంటాయి. కాజ్‌వే దెబ్బ తినడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

వేసవిలో కూల్ కూల్



గంభీరం వద్ద విక్రయిస్తున్న మట్టి కుండలు



పైపులు అమర్చిన వివిధ మట్టిపాత్రలు



వేసవి రావడంతో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. ఎలాంటి హాని కారకాలు లేని మట్టికుండలు, కూజాలలో నీటిని తాగితే వడదెబ్బ తగిలే అవకాశాలు తక్కువ. మట్టికుండలలో నీరు సహజంగా శుభ్రం అయి చల్లగా ఉంటుంది. దీంతో గ్రామీణులు, పట్టణవాసులు మట్టికుండల కోసం గాలిస్తున్నారు. ఆనందపురం జాతీయ రహదారిపై గంభీరం ఆర్టీవో కార్యాలయం ఎదురుగా రాజస్థాన్‌కు చెందిన తయారీదారులు అక్కడి ఎర్రమట్టితో తయారు చేసిన వివిధ పాత్రలు విక్రయిస్తున్నారు. పైపులు అమర్చిన కూజాలు, కుండలు, వాటర్ బాటిళ్లు, కుక్కర్లు అందుబాటులో ఉంచారు. కొన్ని పాత్రలకు డిజైన్లు, మూతలు కూడా ఉన్నాయి. పచ్చళ్ల సీజన్ కావడంతో ఊరగాయలను ఏడాది మొత్తం నిల్వ ఉంచేందుకు వివిధ సైజుల్లో జాడీలు కూడా అందుబాటులో ఉంచారు. ఇవే కాకుండా పింగాణీ మట్టితో చేసిన తులసికోటలు కూడా ఇక్కడ లభ్యమవుతున్నాయి. రూ.150 నుంచి రూ.850 వరకు ధరలకు వీటిని విక్రయిస్తున్నారు.

– తగరపువలస

బంగారు నక్లెస్ చోరీ నిందితునికి రిమాండ్



నిందితుడు రెడ్డి శంకరరావు

తగరపువలస: స్థానిక బైపాస్ రోడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ రూమ్ నంబర్-2లో ఈ నెల 14న రెండు తులాల బంగారు నక్లెస్ చోరీకి గురైన సంఘటనలో నిందితుడిని భీమిలి క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలివి.. విజయనగరం జిల్లా నందిగాం గ్రామానికి చెందిన పి.రమేష్, భార్యతో కలసి ఈ నెల 14న ఫంక్షన్ హాల్లో జరిగిన పెళ్లికి హాజరయ్యారు. తమకు కేటాయించిన రూమ్‌లో లగేజీ ఉంచి, పెళ్లి అనంతరం రాత్రి 12.30 గంటలకు వెనక్కి వచ్చి చూడగా గదిలో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఫంక్షన్ హాల్ సూపర్‌వైజర్ సాయంతో సీసీ కెమెరాలో చూడగా రాత్రి 7.30 సమయంలో గుర్తు తెలియని వ్యక్తి గదిలో నుంచి బయటకు రావడాన్ని గుర్తించారు. దీంతో బాధితుడు భీమిలి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ సూర్యప్రకాష్ సీసీ పుటేజీ ఆధారంగా విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన రెడ్డి శంకరరావు(45)ను నిందితుడిగా గుర్తించి, అరెస్ట్ చేశారు. నక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పచ్చదనంతోనే మానవాళి మనుగడ



వరల్డ్ ఫారెస్ట్ డే ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మధురవాడ: పచ్చదనమే మానవాళి మనుగడకు రక్షణ కల్పిస్తుందని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రవి అన్నారు. అడవులను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూగోళంపై మూడింట ఒక వంతు అడవులే ఉన్నాయన్నారు. అడవులు అభివృద్ధి చేసే పర్యావరణ సమతుల్యత ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి చెట్లను పెంచడం, వాటిని కాపాడడమే బాధ్యతగా పెట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ స్వామి, పి.రాము, లక్ష్మి, వరలక్ష్మి, అనిల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో బాలికకు డయేరియా

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ కాలనీలో డయేరియాతో బాధపడుతున్న 4ఏళ్ల బాలిక రుషికొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సాగర్‌నగర్ ఏంఐజీ గృహ సముదాయంలో నివాసం ఉంటున్న ఓ కుటుంబానికి చెందిన బాలిక వారం రోజులుగా వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతూ, అస్వస్థతకు గురైంది. దీంతో తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్పించారు. బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆశ వర్కర్లు చుట్టుపక్కల ఈ తరహా కేసులు ఉన్నాయా అని విచారణ చేసి, అప్రమత్తం చేశారు.

గంభీరంలో గెడ్డవాగు కబ్జా



సర్వే నంబర్ 141లో గెడ్డవాగులో వేసిన ఫెన్సింగ్

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ సర్వే నంబర్ 141లో గెడ్డవాగును కబ్జాదారులు ఆక్రమించారు. రాత్రికి రాత్రే సుమారు 500 గజాల గెడ్డను చదును చేసి అక్కడ ఫెన్సింగ్ నిర్మించారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు మండలంలోని ప్రభుత్వ భూములను వదలడం లేదు. నిత్యం మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా, గ్రామ స్థాయిలో వీఆర్వో దగ్గర నుంచి తహసీల్దార్ వరకు మిన్నకుండిపోవడం విమర్శలకు దారి తీస్తుంది. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.